# గులకరాళ్లు

మాధవరావు ఈ మూడు నెలల సర్వీసులో కనీసం ముప్పయి సార్లయినా ఆఫీసులో కునుకు తీసినా మూడుసార్లే హెడ్ గుమస్తా సుదర్శనం కంటపడ్డాడు.

రెండుసార్లు క్షమించినవాడు ఈ రోజు అట్టహాసంగా అరచి మరీ ఆఫీసరు యెదరగా నిలబెట్టాడు.

ఆఫీసరు అన్నారావు వానిపై అరచేబదులు దరహాసం చేసి—

''ఏం? నిన్న రాత్రి ఉద్యోగ విజయాల్లో వేషం వేశావా? హార్మనీ వాయించావా?''

''ఒకరు కట్టున్న యింటిని కాపలా కాసాను సార్!''

''పగలు నిద్రపోయి, రాత్రుళ్ళు మెలుకువ వుండి రెండు విధాలుగా ఆర్జిస్తున్నావన్నమాట!" సుదర్శనం బొమలాడించి మరీ అందుకున్నాడు.

"పగలు ఆర్జించడానికి యీ పని చూపించినవారి రుణం రాత్రి కాపలా కాసి తీర్చుకుంటున్నాను సార్!" అంతే.

"మా ఆఫీసరుగారు యిల్లు కట్టడం లేదే?"

"ఇద్దరు కనికరించారు కాబట్టే నేను యీ ఆఫీసులో చేరాను."

ఇంకేదో చెప్పబోతుంటే "సుదర్శనంగారూ! వీడి సంగతేమిటో నేను చూస్తాను, మీరు వెళ్ళండి" అన్నాడు అన్నారావు.

"ఇటు చూడు మాధవరావు! ఇద్దరు కనికరించారన్నావు, ఎవరా యిద్దరు?"

మాధవరావుకు గడచిన గడ్డు రోజులు గుర్తుకు రావటంవలన వెంటనే మాట్లాడలేకపోయాడు.

"ఫరవాలేదు చెప్పు."

"బతుకు ఎడారిలో చిక్కుకుని, పెళ్ళాం పిల్లలతో ఆకలి యెండకు అల్లల్లాడిపోతున్న రోజుల్లో...."

"ఇలా మాట్లాడేవాడికి బంట్రోతుగా చేరే ఖర్మ వచ్చిందని" అన్నారావు అనుకుని చిన్ననవ్వుతో "కానీ చెప్పు....అ రోజుల్లో యేమైంది?"

"ఆకాశంలో నల్ల మేఘంలా.... ఆరేళ్ళ ఓర్పుతో ఆగాక - ఎంప్లాయిమెంట్ యెక్స్ఛేంజ్ నించి పిలుపు వచ్చింది. నల్లమేఘం కనిపించినంత మాత్రాన వర్షం కురుస్తుందా? ఆ వర్షం కురిసినా నా దగ్గర రాలుతుందా? అనుకుకే రెండు కొండల్లా నిల్చున్న యిద్దరు ఘరానా మనుషుల్ని కలుసుకుని బ్రతిమాలి మీతో సిఫారసు చేయించుకున్నాను."

"ఒక కొండ చాలదా?"

"ఒక కొండను తప్పించుకున్న మేఘం ఇంకో కొండను తప్పించుకోలేదన్న ఆశతో...."

"ఇద్దరూ ఒప్పుకున్నారా?"

"ఆఁ. నా అదృష్టంకొద్దీ నా పెళ్ళాం పిల్లల రాత బాగుండబట్టీ ఇద్దరూ ఒప్పుకున్నారు."

"లంచం అడగలేదా?"

"ఒక బాబు అన్నాడు - 'మాధవరావ్! నా సంగతి నీకు తెలీదు. ఏ పూటా నా ఇంట్లో ఒక భోజనం విలువ ఐదు రూపాయలకు తక్కువ వుండదు. నా స్వంత బావమరిది వచ్చినా వాడివల్ల నాకు ఐదు రూపాయలకు మించిన లాభం లేకపోతే, భోజనం పెట్టకుండా వదిలించుకుంటాను. నీ దగ్గర పైసా లేదని తెలుసు. కాని, మాటకు కట్టుబడే మంచి ఉందని విన్నాను. ఇప్పుడు నా పాదాలమీద పడినవాడివి.... ఉద్యోగం అయ్యాక కూడా పడ్తావా?' అంటే పడ్తానని ప్రమాణం చేశాను.

"నువ్వు ఉద్యోగంలో చేరాకే కొండబాబు మూడో ఇల్లు కట్టడం మొదలు పెట్టాడు కదూ?"

"అంతా నాతే రాత్రుళ్ళు అప్పచెప్పి కొండబాబుగారు వెళ్ళిపోతారు సార్! నమ్మినచోట నిద్రపోతే నిందపడవలసి వస్తుంది కదండీ?"

"నీ విషయం నాతో చెప్పిన యింకో కొండ - గిరిబాబు - అతని క్రిందయే చాకిరీ చెయ్యడానికి ఒప్పుకున్నావు?"

"ఆ బాబు యెప్పుడోగానీ యింట్లో వుండరండి! ఉపన్యాసాలివ్వడానికి తిరుగుతుంటారట. ఇంట్లో పని చెయ్యించేదంతా అమ్మగారేనండి! నాకు వుద్యోగం అయ్యాక వాళ్ళు పనివాడ్ని తప్పించారండి! రోజూ ఉదయం, సాయంత్రం అమ్మగారికి నా ముఖం చూపించాలండీ!"

"బజారు మోసుకొస్తుంటావా?"

"బజారేకాదండి, తోటపని, అవసరమైతే పిల్లలను ఆడించడం."

"ఈ రెండిళ్ళకు వెళ్ళనిరోజంటూ వుందా?"

"వెళ్ళకపోతే యింక వుందా? దగ్గర్లోనే వున్న నా యింటిమీద పడరూ? ఒకనాడు ఆలస్యంగా వెళ్తే ఆ అమ్మగారు యేమన్నారో తెలుసాండీ?"

"ఏమన్నారు?"

"వీడు పెళ్ళాం పిల్లలతో రోడ్డుమీద ఆకలితో పడివుంటే మావారు పిల్చి నెలజీతం వచ్చే ఉద్యోగం వేయిస్తే - ఇప్పుడు వీడి కళ్ళు.... అని ఆపేసిందండి! నేను యింకెక్కడో డబ్బుకు కక్కుర్తిపడ్తున్నానని రెండిళ్ళవారి అభిప్రాయం."

ఇంకేదో చెప్పబోతుంటే అన్నారావు వాడిని ఆపి, "చాలు చాలు. ఈ ఆఫీసులో నేను నిద్రపోను. నా క్రింద పని చేసేవాళ్ళు నిద్రపోతే ఒప్పుకోను. మనిషిని బట్టి న్యాయం రంగులు మార్చుకోదు. నీకు నిద్రపోవాలని వుంటే శలవు తీసుకుని హాయిగా యింటిదగ్గర పడుకో...." అన్నాడు.

''చిత్తం సార్.''

''వెళ్ళు.''

కొంతసేపయ్యాక ఫైళ్ళు పట్టుకుని మెయిన్ ట్రేలో పెట్టూ ''వాళ్ళు నేను మీ పని చెయ్యనంటే నన్ను చంపుతారా? అవునూ, కాదూ మధ్య నలిగిపోతూ బాధపడుతున్నవాడిని మీ యెదరగా బయటపడిపోయాను, క్షమించండి'' అన్నాడు మాధవరావు.

అన్నారావు కళ్ళద్దాలొకసారి తీసి అలా మాధవరావు వేపు ఓ క్షణం చూసి——

''అందరికీ అన్ని పనులు వూరకనే చేస్తున్నవాడివి - నా పనులెందుకు చెయ్యవని?''

''అయ్యా! పోస్టు డొక్కులో పుత్తరం స్వయంగా తమరే వేసుకుంటారు గానీ - నన్ను వెయ్యమనరే. మీరేపని చెయ్యమంటే చెయ్యను"?

''అయితే, ఈ వేళ నా పని చెయ్యాలి. చెప్పేదా?"

"ఈ వేళే?"

''ఏం? వాళ్ళతో వేగంగా వస్తానని మాట ఇచ్చావా?''

''ఫరవాలేదు.''

''వాళ్ళు నీ ఇంటిమీద పడరూ?''

''తప్పక పడ్తారు. తమ పని అయ్యాక వాళ్ళపని చేస్తాను.''

"అయితే - ఆఫీసు వదలగానే నీ యింటికి వెళ్ళు. నా యింటి దగ్గర వుంటానని మీ ఆవిడతో చెప్పు. వాళ్ళు వస్తే నా యింటికి రమ్మని చెప్పు."

మాధవరావు అయన చెప్పినట్లే చేశాడు. చుట్టాలొచ్చారు బజారు తేడానికి యింకా రాలేదని విసిగి, చివరకు అప్పుడే వచ్చిన భర్తను గిరిబాబు పెళ్ళాం మాధవరావు యింటికి పంపించింది. అన్న సమయానికి రాలేదని కొండబాబు వచ్చాడు. ఆఫీసరు గారింటికి వెళ్ళిపోయా డనగానే కొండబాబుకు నమ్మించి ద్రోహం చేశాడని కోపం వచ్చి, "వీధిలో అడుక్కుంటున్న వెధవకు ఉద్యోగంలో వేయిస్తే వీడికెంత పొగరెక్కిందిి?'' అని గట్టిగా అరిస్తే దగ్గరలో నున్న గిరిబాబు—

''నేను చెప్పి వాడ్ని ఉద్యోగంలో వెయ్యిస్తే మీరా ఘనత దక్కించు కుంటున్నారు. ఏమిటి సంగతి?'' అన్నాడు.

"వీడిది మెట్రిక్ పోయిందా? మెట్రిక్ పాసయిన వాళ్ళొస్తే లేదన్నాడు. రాజకీయ నాయకుల సిఫార్సులు బుట్టదాఖలు చేశాడు. కార్లమీద ఇంటిమీద దాడిచేసిన వాళ్ళకి కాదన్నాడు. డబ్బును విషంలా చూశాడు. ఆ అన్నారావు నా మాటకు విలువ యిచ్చి వీడిని ఉద్యోగంలో వేశాడండీ!"

"నేను చెప్పగానే తప్పక చేస్తానన్నాడు. చేశాడు. మాటంటే మాటే...."

"ఎవరి రికమెండేషనువల్ల ఉద్యోగం వచ్చిందో మాధవరావుకు తెలుసు. అందుకే నీ యింట రోజూ ఒక గంటలో పని తేల్చేసి నా యింట పది గంటలు రాత్రి మేల్కొని మరీ కాపలా కాస్తున్నాడు."

"ఆ ఆఫీసరు యింట్లోనే చాకిరీ చేస్తున్నాడట! పదండి, యిప్పుడే తేల్చేద్దాం" అంటూ గిరిబాబు ముందు నడిస్తే అతన్ని దాటుకుంటూ కొండబాబు వెర్రెత్తి పరుగెత్తాడు.

డ్రాయింగు రూములో కాలు పెట్టేసరికి యిద్దరూ వెనుకకు అదిరిపడ్డారు. మాధవరావు తన ఆఫీసరు ప్రక్కన సోఫాలో కూర్చున్నాడు. అన్నారావుభార్య, కూతురు, కొడుకు యెదురుగా కుర్చీలపై కూర్చున్నారు.

"కొండబాబు గారూ! మీరలా కూర్చోండి. గిరిబాబు గారూ! మీరిలా కూర్చోండి. వెళ్ళు శారదా! ఈ అసాధారణ అతిథులకు మంచి కాఫీ...." అనగానే

కొండబాబుకు లోన కోపం వచ్చినా పైకి నవ్వి "ఇప్పుడే తాగి వచ్చా.... వద్దండి...." అన్నాడు. ఆ బంట్రోతు వెధవకు స్వీట్సు వగైరా తినిపించిన పళ్ళెరం యింకా టీపాయ్ మీద వుండగా గిరిబాబు వుత్తి కాఫీ తాగడానికి ఒప్పు కుంటాడా?

చిన్న టేబిలుమీద టేపు రికార్డరు పెట్టి "ఈవేళ నా పని చేసి పెట్టమన్నాను కదా..ఇదే నా పని. పాండవ ఉద్యోగ విజయాల్లో పద్యాలు వరసగా పాడితే రికార్డు చేసుకుంటాను.

"అలా అని మీరు ముందుగా చెప్తే హార్మనీని ఏవరినైనా అడిగి తెద్దును సార్!''

"హార్మనీకి మించిన గొంతుక నీది....కానీ...." అంటూ ఒక అరగంట పద్యాలు రికార్డు చేశాక ''సరే....పెద్దలు ఊరకనే రారు. నా పనేదైనా ఉంటే చెప్పండి" అన్నాడు అన్నారావు.

కొండబాబు ఎరుపెక్కిన ఊసరవెల్లిలా పోజు.పెట్టి "ఒక విషయం తేల్చుకోడానికి మీ దగ్గరకు వచ్చాం" అన్నాడు.

"చెప్పండి."

"ఈ మాధవరావును ఉద్యోగంలో నా రికమెండేషన్ మీద వేశారా? ఈ గిరిబాబు చెప్తే వేశారా?"

"ఇద్దరూ వచ్చి చెప్పారు. ఇప్పుడా గొడవ ఎందుకొచ్చింది?"

"ఇదేదో తేల్చేయాలి" అన్నాడు గిరిబాబు.

"మీ యిద్దరూ ఈ సంగతి అంతు చూద్దామని పట్టుదలతో వచ్చినట్లు న్నారే!"

"ఇదేదో తేలిపోవాలండి! తేలితేగాని ఆ మాధవరావుకు నిజం తెలీదు." మరికాస్త దిట్టంగా మాటలు నమిలాడు కొండబాబు.

అన్నారావు లేచి ఆవేళనే ఆఫీసునించి తెచ్చిన ఒక ఫైలు ఎదురుగా ఉన్న బీరువానించి తీశాడు.

"అయ్యా! ఇద్దరూ పెద్దలు. మీ వెంట పదుగుర్ని తిప్పుకుంటున్నారు. మీకున్న స్వేచ్ఛ మాలాంటి ఉద్యోగస్థులకు ఉండదు కదా! మేం లోకానికి భయపడాలి. మా అంతరాత్మను గౌరవించాలి. అందుకే మీ యిద్దరి రికమెం డేషన్లు విన్నాక ఆనాడు యిదిగోండి చూడండి. మాధవరావు పేరు తొల గించాను."

"అయితే, ఏ మినిష్టరు చెప్తే వేశారు?" మోటుగా ప్రశ్నించాడు కొండబాబు.

అన్నారావు చిన్న నవ్వు నవ్వాడు అంతే.

"ఇప్పుడు కాదంటే సరా?" అన్నాడు గిరిబాబు.

"ఆవేళ మీరన్నట్లు ఎందరెందరో వచ్చి చెప్పారు. మరికొందరు ఫోన్లో చెప్పారు. ఇంటర్వ్యూకు వచ్చిన ప్రతి అభ్యర్థికి ఎవరిదో ఒక సిఫారసు వుంది. మాధవరావుకన్నా హెచ్చు చదువుకున్న వాళ్ళు, ఇదివరకు ఉద్యోగం చేసిన వాళ్ళు, సైన్యంనించి తిరిగి వచ్చినవాళ్ళు, ఇతనికన్నా అర్హత కలిగినవాళ్లు ఎందరో ఉన్నారు. నాకు అలాంటప్పుడు అర్హతలు, రికమెండేషను ప్రధానం కావు."

"ఈ రోజుల్లో ఇంకేం చూస్తారు? చూడగలరు?"

"మనిషి వ్యక్తిత్వం! ఈ మనిషిలో ఎంత మంచి వుంది, ఆ మంచిని కష్ట కాలంలో బ్రతకడానికి ఎంత సవ్యంగా ఉపయోగించుకుంటున్నాడని చూడ టానికి ప్రయత్నించాను."

"ఇంతమందిలో ఈ మాధవరావులోనే మీరెలా చూడగలిగారు?"

"మాధవరావుని ఉద్యోగంలేక ఇన్నాళ్ళూ పెళ్ళాం పిల్లలతో ఎలా బతికావు అని ఇంటర్వ్యూలో అడిగాను. నేను పాడుతూ పదిమందికి పాటలు నేర్పానని అన్నాడు. ఒక పద్యం పాడమన్నాను. రాగయుక్తంగా పాడాడు. ఆ రాగం చివర్లో గొంతుకలో ముద్దకట్టి పోయింది. కళ్ళల్లోనికి చూశాను. ఆ రాగమే కన్నీరుగా మారిందేమో? 'పెళ్ళాం పిల్లలను దక్కించుకోడానికి మొన్ననె చివరకు నా హార్మనీ కూడా అమ్మేశాను బాబూ!' అని వెక్కి వెక్కి ఏడుస్తూ చెప్పాడు. ఒక కళాకారుడు తను ఆరాధించే సరస్వతిని అమ్మేశాడంటే - ఉద్యోగానికి ఇంతకన్నా అర్హత కలిగిన వాడింకెవడున్నాడు? మీ బోడి బఫ్లు, రికమెండేషన్లతో మాధవరావు ఉద్యోగంలో చేరలేదు. వాడి విద్యల సరస్వతి వాడికి ఉద్యోగం ఇప్పించింది. ఇక మీ రిద్దరూ వెళ్ళవచ్చు-"

అంటూ అన్నారావు లేచిపోయాడు. రెండు కొండలూ ప్రవాహంలో కొట్టుకపోయే రెండు గులకరాళ్ళయ్యాయి. కన్నీరు కారుతున్నా మాధవరావు రెండు కళ్ళూ నవ్వుతున్నాయ్.

*

(1975)